కాంగ్రెస్‌లో చేరిన మిత్ర కృష్ణ



మిత్ర కృష్ణకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణ, తూంకుంట అరుణ్ కుమార్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట యువ నాయకుడు ఐందాల మిత్ర అభిషేక్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పరమానందం తదితరులు

గోల్కొండ: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ తెలంగాణలోని అన్ని స్థానాలను గెలుచుకొని సత్తాచాటుతుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గోల్కొండకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తనకు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం తన జీవితంలోని ముఖ్య ఘట్టం అని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోపే కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒకొక్కటిగా అమలు చేస్తూ వచ్చిందన్నారు. దీని వల్ల ప్రజల్లో కాంగ్రెస్‌కు ఆదరణ పెరిగిందని అన్నారు. రాష్ట్రాన్ని అగ్రదిశలో పయనింపజేసే శక్తి సామర్థ్యాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉందన్నారు. ఆయనను కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పరమానందం తదితరులున్నారు.

'బీఆర్ఎస్ సముద్రం లాంటి పార్టీ'



ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ పార్టీ సముద్రం లాంటి పార్టీ అని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎవరైనా బీఆర్ఎస్‌ను విడిచి ఇతర పార్టీల్లోకి వెళ్తే తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం ద్వారా ఒరిగేది ఏమీ లేదన్నారు. రెండుసార్లు ఆమెకు పార్టీ కార్పొరేట్ టికెట్ ఇచ్చిందన్నారు. మంగళ్‌హాట్‌తో పాటు ధూల్‌పేట్ నలుమూలలా స్థానిక ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. ప్రజా సమస్యలను విస్మరిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే ఈ పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కాంగ్రెస్‌లో బోయినపల్లి కృష్ణమూర్తి చేరిక



అబిడ్స్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ బోయినపల్లి కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం దీపాదాస్ మున్షీ ఆయనకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ నలుమూలలా ప్రజల్లో మంచి పట్టు ఉన్న బోయినపల్లి కృష్ణమూర్తి కాంగ్రెస్ పార్టీలో చేరడం పార్టీకి కొండంత బలం చేకూరిందన్నారు. బోయినపల్లి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అభివృద్ధి, ప్రగతి, సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో ఆరేళ్ల చిన్నారి మృతి



అబిడ్స్: ఆరేళ్ల చిన్నారి అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మృతి చెందింది. ఈ విషాద ఘటన షాయి నాయత్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోషామహల్ జోషి వాడిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ నుంచి నగరానికి వచ్చిన అస్మిత, టిల్లులు భార్యాభర్తలు. వీరిద్దరూ వివిధ పనుల మీద వారి ముగ్గురు పిల్లలను ఇంట్లో ఉంచి బయటికి వెళ్లేవారు. రోజు మాదిరిగా గురువారం సైతం తండ్రి టిల్లు, తల్లి అస్మిత పనుల కోసం బయటికి వెళ్లారు. రాత్రి 8:30 గంటల ప్రాంతంలో తల్లి అస్మిత ఇంటికి వచ్చి చూడగా ముందుగా డోర్ తీయలేదు. కొద్ది సేపు తర్వాత మూడేళ్ల బాలుడు గడియ తీయడంతో రూమ్‌లోకి వెళ్లి చూడడంతో ఆరేళ్ల కూతురు గోడకు ఉన్న ఇనుప రాడుకు చున్నితో ఉరి వేసుకున్నట్లు గ్రహించింది. వెంటనే చుట్టు ప్రాంతాల వారితో మాట్లాడి పిలిచి నిలోఫర్ ఆస్పత్రికి తరలించింది .ఆస్పత్రి సిబ్బంది ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లక్ష్మయ్య ఆసుపత్రికి వెళ్లి మృతి చెందిన పవిత్రను ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఆరేళ్ల చిన్నారి ఆత్మహత్యకు పాల్పడిందని విషయం ఎంతో అనుమానాస్పదంగా ఉందన్నారు. ఈ కేసును పోలీసులు అనుమానాస్పద కేసు నమోదుగా చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌గన్‌తో బెదిరింపులు..

ఇద్దరు నిందితుల అరెస్ట్

దబీర్‌పురా: పెట్రోల్ బంక్‌లో సిబ్బందిని ఎయిర్‌గన్‌తో బెదిరించిన కేసులో ఇద్దరు నిందితులను మీర్‌చౌక్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మీర్‌చౌక్ ఏసీపీ ఎన్.ఎస్.వి.వెంకటేశ్వర్ రావు ఇన్‌స్పెక్టర్ ఆర్.రవీందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 27న హుస్సేనీకోటి ప్రాంతానికి చెందిన భక్షి, గంగానగర్ నాలా ప్రాంతానికి చెందిన మహ్మద్ అర్షద్ పెట్రోల్ పోయించుకునేందుకు మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎతేబార్ చౌక్‌లోని హైదరాబాద్ ఫిల్లింగ్ స్టేషన్‌కు వచ్చారు. వారు క్యూ లైన్‌లో రాకుండా పక్క నుంచి వచ్చి పెట్రోల్ పోయాలని కోరడంతో సిబ్బందితో గొడవ జరిగింది. దీంతో వారిలో ఒకరు రాడ్‌తో దాడి చేసేందుకు యత్నించగా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో తమ వద్ద ఉన్న ఎయిర్‌గన్ తీసి చంపేస్తానని బెదిరించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తుండగా తప్పించుకుని పరారయ్యారు. బంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఎయిర్‌గన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. భక్షి అలీ ఆలియాస్ జహీద్ ఆలియాస్ గోల్డీపై మీర్‌చౌక్ పీఎస్ పరిధిలో 16 ఈ-పెట్టి కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తూకం.. మోసం

● పట్టించుకోని తూనికలు కొలతల శాఖాధికారులు ● మామిడి పండ్ల సీజన్ కావడంతో మోసానికి పాల్పడుతున్న కొందరు వ్యాపారులు

చార్మినార్: పాతబస్తీలో పండ్ల వ్యాపారులు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు..తూకాల్లో మోసాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీంతో వినియోగదారులు తూకాల్లో పెద్ద ఎత్తున మోసాలకు గురవుతున్నారు. పాతబస్తీలోని కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్‌లతో పాటు స్క్రాప్ దుకాణాలు.. ఇలా ప్రతి దాంట్లో కచ్చితమైన తూకాలు జరగడం లేదు. ఏడాదికోసారి కూడా జిల్లా తూనికలు, కొలతలు శాఖ అధికారులు, సిబ్బంది పాతబస్తీలో తనిఖీలు నిర్వహించడం లేదు. పాతబస్తీ వైపు కన్నెత్తి చూడకపోవడంతో తూకాల్లో మోసాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కొంత మంది నిజాయితీగా తమ వ్యాపారాలను కొనసాగిస్తుండగా..అక్రమ సంపాదనే ధ్యేయంగా మరికొంత మంది తక్కువ బరువులతో వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాల్సి ఉండగా..ఆ దిశలో స్పందించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రెండు శాఖల నడుమ సమన్వయ లోపం కారణంగా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిత్యవసర వస్తువులతో పాటు కూరగాయలు, పండ్లు, పెట్రోల్ బంకుల్లో సైతం తూకాల్లో వ్యత్యాసం కనబడుతుందని వినియోగదారులు లబోదిబోమంటున్నా..పట్టించుకునే వారు కరువయ్యారు.



మామిడి పండ్లు ఖరీదు చేస్తున్న వినియోగదారుడు

పాతబస్తీలో కనిపించని తనిఖీలు..

ప్రతి ఏడాది ఆయా వ్యాపార సంస్థలు, వ్యాపారస్తులు సంబంధిత జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులతో గుర్తింపు పొందిన బరువుల (వెయిట్స్)ను వినియోగించాలి. కిలో, రెండు కిలోలు..ఇలా ఏ బరువులైతే వినియోగిస్తారో ఆయా బరువులు సంబంధిత తూనికలు, కొలతలు శాఖ (వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్) అధికారులతో గుర్తింపు పొందాల్సి ఉంటుంది. అయితే పాతబస్తీలోని చాలా మంది వ్యాపారులు ఎలాంటి గుర్తింపు లేని బరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కొంత మంది వినియోగిస్తున్న బరువుల్లో చాలా వరకు తేడాలు కనిపిస్తున్నాయి. కిలో బరువుతో ఏదైన వస్తువు ఖరీదు చేస్తే..వినియోగదారునికి అందులో 50–100 గ్రాములు తరుగు వస్తుంది. ఖరీదు చేసిన వస్తువులను మరోచోట మళ్లీ తూకం వేయించుకునే సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారస్తుల మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

మామిడి పండ్ల సీజన్‌లో..

ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ తూకంతో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. కొంత మంది వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా తూకంలో మోసం చేస్తున్నారు. రెండు కిలోల మామిడి పండ్లు ఖరీదు చేస్తే..అందులో పావుకిలో తక్కువగా వస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సరైన తూకంతో వినియోగదారులను ఆకట్టుకుంటుండగా..మరికొంత మంది మోసాలకు పాల్పడుతున్నారు. వీరిని కట్టడి చేయాల్సిన అవసరముందని వినియోగదారులు కోరుతున్నారు. వీరు వినియోగించే బరువులు సంబంధిత అధికారుల నుంచి గుర్తింపు పొందినవి కాకపోవడంతో మోసాలు జరుగుతున్నాయి.

ధూల్‌పేట అభివృద్ధికి కృషి చేస్తా



కాంగ్రెస్ పార్టీలో చేరిన పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రగతికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. 100 రోజుల్లోనే పేద బడుగు వర్గాల ప్రజల కోసం ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..ధూల్‌పేట సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు ధూల్‌పేట అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రార్థనా స్థలాల అభివృద్ధికి కృషి



మసీదు నిర్వహణ కమిటీ వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రార్థనా స్థలాల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన బడాబజార్‌లోని అశ్రఫి మసీదులో మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అశ్రఫి మసీదు ఎంతో పురాతనమైందని, ఇది నేటికీ చెక్కు చెదరకుండా ఉందన్నారు. దీనికి బాధ్యులైన మసీదు కమిటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ నిర్వాహకులు, పలువురు మజ్లిస్ నాయకులు ఉన్నారు.

రాబోయే బోనాల జాతరకు సీఎంను కలవాలి



గాజుల అంజయ్యను సత్కరిస్తున్న పలు దేవాలయాకు చెందిన ప్రతినిధులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలను మర్యాదపూర్వకంగా కలవాలని పాతబస్తీలోని పలు దేవాలయాలకు చెందిన ప్రతినిధులు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యకు సూచించారు. ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బేలా ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు పాటేల్ సదానంద్ యాదవ్, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి, టీపీసీసీ కార్యదర్శి, గౌలిపురా కోట మైసమ్మ ఆలయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.ఎస్.ఆనంద్‌రావు, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, కోట్ల అలీజా కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు నాయికోట్ బాబురాజా, కోటిరెడ్డి, శ్రీధర్ యాదవ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రానున్న ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలపై ఆయనతో చర్చించారు.

సన్మానం



మైత్రి కమిటీ సభ్యులు ఇలియాస్ అక్తర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణలో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల పాత్ర కీలకమైందని గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి అన్నారు. శుక్రవారం రిసాల బజార్‌లో ఆయన ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో పాటు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రియాజ్ అలీఖాన్, శ్రీకాంత్ చారి, మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

గృహిణి అదృశ్యం



నాజియా హసన్

గౌలిపురా: తల్లిగారింటికి వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎం.అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..దూద్‌బౌలి హుస్సేనీఆలం ప్రాంతానికి చెందిన సయ్యద్‌ముస్తాఫా అలీ, నాజియా హసన్ (37)లు దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాజియా హసన్ ఈ నెల 28న రాత్రి 8 గంటలకు మొఘల్‌పురా ఆస్రా ఆసుపత్రి సమీపంలో నివాసముండే తల్లిగారింటికి వెళ్లింది. అనంతరం అక్కడి నుంచి కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భార్య కనిపించడం లేదని ముస్తాఫా అలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగనున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు 15 స్థానాల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని భాగ్యలక్ష్మి అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

యౌముల్ ఖురాన్ సభలు రద్దు

శాలిబండ: రంజాన్ మాసంలో ఐదు శుక్రవారాల పాటు నిర్వహించే యౌముల్ ఖురాన్ సభలను పార్లమెంటు ఎన్నికల కోడ్ నేపథ్యంలో రద్దు చేయడం జరిగిందని మక్కా మసీదు సూపరింటెండెంట్ మహ్మద్ సిద్దిఖీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే

క్రైస్తవులు 'గుడ్ ఫ్రై డే'ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అబిడ్స్‌లోని మెథడిస్ట్, సెయింట్ జోసెఫ్ కేథెడ్రల్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు వేషధారణల్లో సిలువ మోసి ఆయన త్యాగాలను కళ్లకు కట్టారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి.

– సాక్షి, సిటీబ్యూరో



సెయింట్ జోసెఫ్ కెథెడ్రల్ చర్చిలో..





మెథడిస్ట్ చర్చిలో...

'రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం పవిత్రమైంది'



అక్తరీ మసీదులో మాట్లాడుతున్న సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: రంజాన్ మాసంలో ప్రతి శుక్రవారం ఎంతో పవిత్రమైందని అఖిల భారత తీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్‌ఆలీషా ఖాద్రీ అన్నారు. శుక్రవారం గోల్కొండ దిలావర్‌షా మసీదులోని అక్తరీ మసీదులో రంజాన్ మాసం శుక్రవారంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఈదుల్ మోమీనిన్ అని పిలుస్తారన్నారు. రంజాన్ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని పేర్కొన్నారు. రంజాన్ మాసం శుక్రవారాలకు హాజరైయ్యే వారికి అల్లా కరుణిస్తాడని ప్రార్థనలు చేసే వారికి సుఖసంతోషాలతో పాటు ఆరోగ్యం, వ్యక్తిగత జీవితంలో సమస్యలు దూరం అవుతాయన్నారు. టెర్రరిస్ట్ కార్యకలాపాలకు ఇస్లాం మతంలో తావులేదని ప్రవక్త మహ్మద్ జీవితం దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. దేశం కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడే వారే నిజమైన దేశభక్తులని ఆయన పేర్కొన్నారు.

ఏప్రిల్ 1న నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికై న నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశాన్ని ఏప్రిల్ 1న నాంపల్లి గృహకల్ప భవన సముదాయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలియజేశారు. శుక్రవారం ఆయన నాంపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యఅతిథులుగా టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్, సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ, రాష్ట్ర సహాధ్యక్షులు బి.శ్యామ్ హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘానికి వరుసగా ఆరు పర్యాయాలు అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం జ్ఞానేశ్వర్‌ను ఈ సందర్భంగా సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 33 జిల్లాలకు చెందిన తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులు హాజరవుతున్నట్లు తెలిపారు.

'నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించొద్దు'



మాట్లాడుతున్న మహ్మద్ అమానుల్లాఖాన్

సుల్తాన్‌బజార్: నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించకుండా నగర పోలీస్ కమిషనర్, ఆర్‌టీఏ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లా ఖాన్ అన్నారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. పొరుగు జిల్లాల్లో రిజిస్టరైన వేలాది ఆటోలు నగరంలోకి రావడంతో ఇక్కడి ఆటో డ్రైవర్లకు గిరాకీ లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వేల సంఖ్యల్లో పొరుగు జిల్లాల ఆటోలు ప్రవేశించడంతో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఓలా, ఊబెర్, ర్యాపిడో, క్యాబ్‌ల యాజమాన్యాలు చేసే దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు కె.లక్ష్మీనర్సయ్య, ఎస్‌కే జామా, మహ్మద్ అజీముద్దీన్, షేక్ రహీం పాల్గొన్నారు.

70 శాతం మహిళలకు ఐరన్ లోపంతో సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ నర్మద

గన్‌ఫౌండ్రీ: దేశ వ్యాప్తంగా 70 శాతం మహిళలు ఐరన్, క్యాల్షియం లోపంతో బాధపడుతున్నారని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ హెచ్.నర్మద ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం నిజాం కళాశాలలో కళాశాల మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరన్, క్యాల్షియం లోపాలు అనే అంశంపై సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇటీవల గ్రామాల్లో జరిపిన ఓ అధ్యాయనం ప్రకారం..40 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు 80 ఏళ్ల వయస్సు ఉన్నట్లుగా కన్పిస్తున్నారన్నారు. ఇందుకు గల ప్రధాన కారణం ఐరన్, క్యాల్షియం విటమిన్ లోపమేనని తెలిపారు. ఈ లోపాల వల్ల మహిళలు రక్తహీనత, ఎముకల బలహీనత వంటి రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది షాజీరా పర్వీన్, విశ్రాంత ప్రిన్సిపల్ జడ్జి ఉదయ గౌరి, నోవా స్పేస్ డైరెక్టర్ ఇంజనీర్ వి.చెన్నకేశ్వరీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా, మహిళా సాధికారత కో ఆర్డినేటర్ ఎస్.స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 13న 'మా భగవతి విశాల్ జాగరణ్'



సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హీరాలాల్, సభ్యులు

జియాగూడ: రహీంపురా మా భగవతి విశాల్ జాగరణ్ సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న సాయంత్రం 8 గంటలకు రహీంపురా డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్లే గ్రౌండ్‌లో భారీ ఎత్తున జాగరణ నిర్వహించడం జరుగుతుందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హీరాలాల్ అన్నారు. శుక్రవారం రహీంపురాలోని సమితి కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హీరాలాల్ మాట్లాడుతూ..27వ మా భగవతి విశాల్ జాగరణ్‌లో గాయకులు సుశీల్ గోపాల్ బజాజ్, ఠాకూర్ రవిసింగ్, ఎస్.రాజన్‌కుమార్, భజన గేయాలాపన చేస్తారన్నారు. తారా రాణి కథను అనూప్‌కుమార్ గానం చేస్తారన్నారు. మా భగవతి జాగరణ్‌లో ప్రత్యేక ఆకర్షణగా మాతా రాణి అలౌక శృంగార్, అద్భుత జ్యోతి చెప్పన్ బోగ్, లంగర్ ప్రసాద్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఠాకూర్ రవిసింగ్, ఠాకూర్ విపిన్‌రాజ్ సింగ్, కైలాష్ సింగ్, సుధీర్ సింగ్, బి.ధన్‌రాజ్‌సింగ్, గోపాల్ సింగ్, ఠాకూర్ సచిన్‌రాజ్ సింగ్, జె.ముఖేష్ సింగ్, ఠాకూర్ కిషన్ సింగ్, సి.మహేష్ సింగ్, బలరామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్లను పంపిణీ చేసిన డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి

అబిడ్స్: పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. సీతారామ్‌బాగ్‌లోని ఈశ్వరచంద్ర చారిటబుల్ ట్రస్టులో శుక్రవారం పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, అంబర్‌పేట్ పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్, డీసీపీ పరవస్తు మదుకర్‌స్వామి కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి, మహిళా వికాసం కోసం తమ ఫౌండేషన్‌తో పాటు రాంకీ ఫౌండేషన్లు కూడా నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. మహిళకు పలు స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి వారికి అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వ రాంరెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, డాక్టర్ విద్యాభూషన్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల విడిభాగాలను అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

గన్‌ఫౌండ్రీ: ద్విచక్ర వాహనాల విడిభాగాలను దొంగతనంగా అమ్ముతున్న ఓ వ్యక్తిని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కింగ్‌కోఠి ప్రాంతానికి చెందిన అక్బరుద్దీన్(34) లైట్ మిషన్ వర్క్ చేస్తుంటాడు. అక్రమ మార్గంలో సంపాదించాలనే దురాచనలతో ద్విచక్ర వాహనాల విడిభాగాలను విడదీసి విక్రయించడం, పత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయడం వంటి అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు. పలువురు బాధితులు తెలిపిన వివరల ప్రకారం.. పోలీసులు తన షాపుపై దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 7 ద్విచక్ర వాహనాలు, 40 ఆల్ఫాబెటికల్ ఐరన్ బిట్స్, 9 సంఖ్యాపరమైన ఐరెన్‌బిట్స్, ఒక కట్టింగ్ మిషన్‌లతో కూడిన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ మొత్తం రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలపారు. తుదిపరి విచారణకై నిందితుడిని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.